క్లుప్తంగా

ఉత్సవమూర్తులకు విశేష పూజలు



పల్లకీని అరుగుపై ఉంచుతున్న బోయిలు

రుద్రవరం: ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వామి వారికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తుల పల్లకీ మండలంలోని చందలూరులో వివిధ తెలుపుల మీద కొలువు దీరగా ఆయా తెలుపుల యజమానులు, చుట్టుపక్కల ప్రజలు కాయా కర్పూరాలతో వెళ్లి అర్చకులకు అందించగా వాటిని స్వామివారికి సమర్పించి సెటారుతో భక్తులకు ఆశీర్వచనాలు పలికారు. రాత్రికి స్వామి వారి పల్లకీ చిలుకలూరు గ్రామానికి చేరుకుంది.

ఘర్షణలకు దూరంగా ఉండండి



కాలనీవాసులకు సూచనలు చేస్తున్న పోలీసులు

శిరివెళ్ల: స్థానిక కాలనీలో ఆదివారం పోలీస్‌లు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ వంశీధర్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ చిన్న పీరయ్య, రుద్రవరం ఎస్‌ఐ వరప్రసాదు సిబ్బందితో కలిసి కాలనీలోని అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ప్రధాన వీధుల్లో రోడ్ మార్చ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రజలతో మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పవద్దని, కాలనీలలో నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయన్నారు. చిన్న చిన్న మనస్పర్థలతో గొడవలకు దిగవద్దన్నారు. ఘర్షణల నివారణకు ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపి వారికి విద్యా బుద్ధులు నేర్పించాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునగుప్త

నంద్యాల(అర్బన్): ప్రమాదాలు, మానవ తప్పిదాల వల్లే జరుగుతాయని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే వాటిని వీలైనంత వరకు నివారించవచ్చని ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు సేఫ్టీపై విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఉల్లంఘనలు, జరిమానాలు, ప్రమాదాలకు కారణాలు వంటి వాటిపై విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. సురక్షిత డ్రైవింగ్‌ను అలవాటు చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని సూచించారు.

మత్స్యకారులకు గుర్తింపు కార్డు తప్పనిసరి



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి

పగిడ్యాల: శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో చేపల వేట కొనసాగించేందుకు ఇతర గ్రామాల నుంచి వచ్చిన మత్స్యకారులకు ఆధార్, ఫోన్ నంబర్స్ వంటి గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని ముచ్చుమర్రి ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని నెహ్రూనగర్ సమీపాన కృష్ణానది పరివాహకం వెంట ఏర్పాటు చేసుకున్న మత్స్యకారుల స్థావరాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మత్స్యకారులతో మాట్లాడుతూ వలలు లాగేందుకు వివిధ ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి కూలీ డబ్బులు సరిగా ఇవ్వడం లేదనే సమాచారం ఉందన్నారు. వలలు లాగే ప్రతి మత్స్యకారుడికి ఆధార్ కార్డుతో పాటు ఫోన్ నంబర్ తప్పనిసరిగా సేకరించి వారి కుటుంబీకులతో టచ్‌లో ఉండేలా మేస్త్రీలు జాగ్రత్త వహించాలన్నారు. ఆధార్, ఫోన్ నంబర్స్ లేని మత్స్యకార కూలీలను తక్షణమే వారి కూలీ డబ్బు ఇచ్చి పంపివేయాలని హెచ్చరించారు. ఆధార్, ఫోన్ నంబర్స్ లేని ఆరుగురు కూలీలను వారి స్వగ్రామాలకు పంపించాలని మేస్త్రీలకు సూచించారు. ఏ చిన్న ఘటన చోటుచేసుకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్రాంతి పోయి నెలైనా నత్తనడకే..



కొండుపల్లె గ్రామ సమీపంలో ప్యాచ్ వర్క్ పనులు చేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: సంక్రాంతి పండుగకు గుంతలు లేని రోడ్లు కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని గొప్పలు చెప్పిన నాయకులు ప్రస్తుతం శివరాత్రి పండుగ సమీపిస్తున్నా వాటిని పూడ్చలేకపోయారు. మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారులపై గుంతలను పూడ్చేందుకు దాదాపు రెండు నెలల క్రితం ప్రభుత్వం రూ.36.50 లక్షల నిధులను మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నత్తనడకన పనులు చేస్తున్నారు. ఆర్ అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపించడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలుస్తోంది. ఉయ్యాలవాడ మండలంలోని భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె రహదారిలో 26 కి.మీ పొడవునా ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు రూ.8.50 లక్షలు వ్యయం చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో 6వ కిలో మీటర్ నుంచి మాయలూరు 18వ కిలోమీటర్ వరకు రూ.4.50 లక్షలు, కోవెలకుంట్ల, జమ్మలమడుగు ప్రధాన రహదారి నుంచి ఒంటెద్దుపల్లె వరకు రూ.4.50 లక్షలు, ఉయ్యాలవాడ, సుద్దమల్ల రోడ్డుకు రూ.4.50 లక్షలు, గుళ్లదుర్తి, హరివరం రోడ్డుకు రూ.3.50 లక్షలు, పెద్దయమ్మనూరు, కాకరవాడ రోడ్డుకు రూ.5 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ పనుల్లో అధిక శాతం నత్తనడకన సాగుతుండడంతో ఎప్పుడు పూర్తవుతాయో? రోడ్లు ఎప్పుడు బాగై అందుబాటులోకి వస్తాయో అని ఆయా గ్రామాల ప్రజలు నిట్టూరుస్తున్నారు.

పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లీ.. దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొంగల కోలాహలం



కుందూ తీరంలోని పొలాల్లో ఆహారాన్వేషణలో కొంగలు

ఇన్నాళ్లుగా పొలాల వెంట ఆహార అన్వేషణ చేసిన కొంగలు ప్రస్తుతం కుందూతీరం వెంట తిరుగుతున్నాయి. ప్రస్తుతం కుందూలో నీటి ప్రవాహం తగ్గుతుండటంతో చేపల కోసం గుంపులు గుంపులుగా చేరి కోలాహలం చేస్తున్నాయి. అంతేగాక ప్రస్తుతం వాటికి సంతానోత్పత్తి సమయం కావడంతో గుంపులుగా చేరి చూపరులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. – దొర్నిపాడు

అడుగు బయట పెట్టాలంటే హడల్!

- వీధి కుక్కలు, కోతులతో బెంబేలు
- బైక్‌లపై వెళ్లే వారిని వెంటాడుతున్న కుక్కలు
- దాడులకు తెగబడుతున్న కోతులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



ఇళ్ల మధ్య సంచరిస్తున్న కోతులు



రోడ్డుపై వీధి కుక్కల గుంపు

గోస్పాడు: గ్రామాల్లో కోతులు, కుక్కల బెడద అధికంగా ఉంది. వీధుల్లో ఎక్కడ చూసినా కోతులు, కుక్కలు గుంపులుగుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు రాకపోకలు సాగించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు అవసరమున్న సమయాల్లో ఏదైనా వస్తువులను, తినుబండారాలను తీసుకెళ్లే సమయంలో కోతులు దాడి చేస్తున్నాయి. కుక్కలు, కోతుల బెడదపై స్థానిక పంచాయతీ అధికారులు గాని, మండల స్థాయి అధికారులు గానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. సమస్యను అలాగే వదిలేయడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. దీంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోతుల స్వైర విహారం

కోతి చేష్టలతో ప్రజలు విసిగిపోయి ఏమీ చేయలేని స్థితిలో అష్టకష్టాలు పడుతున్నారు. కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఇంట్లోని వారు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా లోపలికి చొరబడి కూరగాయలు, పండ్లు, డబ్బాల్లో ఉన్న వస్తువులను తీసుకెళ్లడమే కాకుండా ఇష్టానుసారంగా పారవేసి చిందరవందర చేస్తున్నాయి. వాటిని తోలేందుకు ప్రయత్నిస్తే మీదకు తిరగబడుతున్నాయి. అలాగే డిష్ వైర్లు, కేబుల్ టీవీ వైర్లు, నెట్ వైర్లను పట్టుకొని వేలాడుతూ తెంపేస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ తిష్ట వేసి ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇంటి ఆవరణలోని మొక్కలను సైతం పీకేస్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామసింహాలతో హడలిపోతున్న ప్రజలు

కోతులకు తోడు గ్రామాల్లో వీధి కుక్కల బెడద ప్రజలను వేధిస్తోంది. వీటి సంతతి రోజురోజుకూ ఎక్కువైపోయి రోడ్డుపై ఒంటరిగా వెళ్లాలంటే భయపడేలా పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలకు వెళ్లేటప్పుడు విద్యార్థులను, ఒంటరిగా వెళ్లే వారిని, ద్విచక్ర వాహనదారుల వెంటబడి హడలెత్తిస్తున్నాయి. వీధి కుక్కల సంఖ్య పెరిగిపోయి వీటికి సరిపడా ఆహారం దొరకక ప్రజలను కరిచేందుకు వస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కుక్కకాటు కేసుల సంఖ్య పెరుగుతోందని స్థానిక వైద్యులు చెబుతున్నారు. గతేడాది మండలంలో వంద మందికి పైగా కుక్కకాటుకు గురైన సంఘటనలు ఉన్నట్లు చెబుతున్నారు. రహదారులపై రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంట్లోకి చొరబడుతున్నాయి



గ్రామంలో కోతుల బెడద ఎక్కువైంది. ఇంట్లో పనులు చేసుకుంటూ తలుపులు వేయడం మరిచిపోతే చాలు లోపలికి చొరబడుతున్నాయి. డబ్బాలతో పాటు, కూరగాయలు, పండ్లు ఎత్తుకెళ్లి ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వాటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే తిరగబడుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి కోతుల బెడదను తొలగించాలి.

– రాములమ్మ

వీధి కుక్కలతో ఇబ్బంది పడుతున్నాం



గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతుండడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. ద్విచక్ర వాహనంపై వెళ్తుంటే వెంటపడి కరిచేందుకు వస్తున్నాయి. ఎక్కడ కరుస్తాయోనని మరింత వేగంగా వెళ్లాల్సి వస్తోంది. హఠాత్తుగా మీదకు వస్తుండటంతో ఎక్కడ ప్రమాదానికి గురి కావాల్సి వస్తుందోనని భయంగా ఉంది.

–చెన్నయ్య

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

కుంభమేళాలో ప్రాణనష్టం జరగకుండా చూడాలి

నంద్యాల(అర్బన్): ఉత్తరప్రదేశ్‌లోని మహా కుంభ మేళాకు భక్తులు పోటెత్తుతున్నారని, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌ఖాన్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సౌకర్యాలు లేకనే తొక్కిసలాటలు జరిగి వందలాది మంది చనిపోతున్నారన్నారు. భక్తిశ్రద్ధలతో మహా కుంభమేళాకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. తొక్కిసలాట మృతుల కుటుంబాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్రాలపై ఉందన్నారు.

అవినీతిని నిర్మూలించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ఆకుమల్ల రహీం

నంద్యాల(అర్బన్): అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అల్ మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీం పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం ఏక్తా యాంటీ కరప్షన్ జాతీయ సంస్థ పర్యవేక్షణలో అవినీతి రహిత సమాజ నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆకుమల్ల రహీం మాట్లాడుతూ.. ఏక్తా యాంటీ కరప్షన్ ద్వారా సమాజంలో జరుగుతున్న అవినీతిని అరికట్టే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లాలో ఈ సంస్థ నిర్మాణం చేపట్టి అవినీతిని కూకటి వేళ్లతో పెకిలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ సమస్య ఉన్నా సంస్థ దృష్టికి తెస్తే బాధితులకు అండగా ఉంటామన్నారు. పలు సంఘాల అధ్యక్షులు సయ్యద్‌బాషా, రఫీ, మహబూబ్‌బాషా, వహిదా తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఎల్లావత్తుల సమీపంలో రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రుద్రవరం: రైతులు పండించిన దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సభ్యులు రామచంద్రుడు, నాయకులు బాలవెంకట్, శంకర్ తదితరులు ఆదివారం ఎల్లావత్తుల, చిన్నకంబలూరు, రుద్రవరం, నర్సాపురం, ఆలమూరు, శ్రీరంగాపురం గ్రామాల వైపు పర్యటించి రోడ్లు, కళ్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. అలాగే రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వరి ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించుకొని నష్టపోయారన్నారు. సేద్యం, విత్తనాలు, రసాయన, పురుగు మందులు, నూర్పిడి ఖర్చులు పెరిగాయని వాటికి తగ్గట్టుగా మద్దతు ధర ప్రకటించాలని కోరారు. నియోజకవర్గంలో వరితో పాటు మొక్కజొన్న, మినుము, వేరుశనగ తదితర పంటలు పండిస్తుంటే ప్రభుత్వం కందులకు మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, ప్రతి పంటకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండు చేశారు. అలాగే యూరియా కొరత లేకుండా చూడాలని, పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20 వేలు వెంటనే ఇవ్వాలని కోరారు.

20న ప్రజాసంఘాల నిరసన



మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు రంగానికి బదలాయించే చట్టాన్ని ఆపాలని, పెట్రోలియం ఉత్పత్తులపై, సెస్, సర్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి జిల్లా నాయకుడు శంకర్, జన విజ్ఞాన వేదిక నాయకుడు రామరాజు, డీవైఎఫ్ఐ కార్యదర్శి శివ, సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో వివిధ ప్రజా సంఘాల నాయకులతో పుల్లా నరసింహ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయింపులు పెంచాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 50 శాతం కేటాయింపులు పెంచాలని, పట్టణాల్లో ఉపాధి హామీ పథకం ప్రారంభించాలని, జీడీపీలో ఆరోగ్యానికి 3 శాతం, విద్యారంగానికి 6 శాతం కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహమ్మద్‌గౌస్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని నక్కలదిన్నె మెట్ట వద్ద ఆదివారం కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రికి చెందిన కుళాయప్ప, వేంపల్లెకు చెందిన గోవర్ధన్ అనే ఇద్దరు బైక్‌పై ఆళ్లగడ్డ వైపు నుంచి చందలూరుకు వెళ్తున్నారు. చందలూరు నుంచి కొందరు కారులో ఆళ్లగడ్డ వైపు వెళ్తున్నారు. నక్కలదిన్నె మెట్ట వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బైక్‌పై వెళ్తున్న ఇరువురు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వారు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నెరవాటి బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపినట్లు అకాడమీ నిర్వాహకులు శ్రీనివాస గుప్త, నెరవాటి వినోద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో అకాడమీకి చెందిన గడ్డం లిఖిత్ కరుణాకర్‌రావు, వెండి పతకాన్ని సాధించారన్నారు. రాష్ట్రస్థాయిలో దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొన్న పోటీల్లో నెరవాటి అకాడమీ క్రీడాకారుడు ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. అదే విధంగా మలికిపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గడ్డం చైత్రిక రావు కాంస్య పతకం సాధించారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో నెరవాటి చిన్నలక్ష్మయ్య, కోచ్ సాయినాథరెడ్డి, చిన్న, గడ్డం చంద్రశేఖర్‌రావు, రేఖాదేవి పాల్గొన్నారు.

గొర్విమానుపల్లెలో కార్డన్‌సెర్చ్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లెలో ఆదివారం సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేశారు. సరైన రికార్డులు లేని పది వాహనాలను సీజ్ చేశారు. చిన్న విషయాలకు గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలని సీఐ సూచించారు. గ్రామంపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అల్లర్లకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరభద్ర స్వామి



స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్త బృందం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పట్టణం బైరుమల్ వీధిలో ఉన్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం 22వ వార్షికోత్సవాన్ని ఆలయ పురోహితులు సాంబయ్య స్వామి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, అర్చనలు తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పురవీధుల గుండా గ్రామోత్సవం కనుల పండువగా చేశారు. గ్రామోత్సవంలో వీరశైవులు ప్రదర్శించిన నంది కోల సేవ, ఖడ్గ ఉచ్చరణ అలరించాయి. వీరభద్ర స్వామి భక్త బృందం, వీరసేవ సంక్షేమ సమాజం సభ్యులు రాజేశ్వరప్ప, కాశీవిశ్వనాథ్, మంజునాథ్, నాగరాజు, రవీంద్రప్రసాద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన కూటమి నాయకులు అధికారం చేపట్టి 9 నెలలు కావొస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడం తగదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి శంకర్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని కార్యాలయంలో.. ఈనెల 23వ తేదీన జరిగే సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖజానా ఖాళీగా ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని, ఇచ్చిన హామీలు అమలు చేయడం సాధ్యం కాదని చెప్పడం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలు ఆగ్రహానికి గురికాకముందే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ కార్యదర్శి ఫరూక్, రైతు సంఘం నాయకుడు శంకరయ్య, వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ నాయకులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ప్రభుత్వ తీరు దారుణం

చాగలమర్రి: శనివారం నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల క్లోజింగ్ అటెండెన్స్ సమయం సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఉన్నప్పటికీ 5.30 గంటల వరకు అటెండెన్స్ పడకుండా లాక్ చేయడాన్ని చాగలమర్రి ఎస్‌టీయూ శాఖ మండలాధ్యక్షుడు గూబగుండం మస్తాన్‌వలి, రాష్ట్ర కౌన్సిలర్ శివశంకర్ తీవ్రంగా ఖండించారు. సుదూర ప్రాంతాల నుంచి సమావేశాలకు హాజరైన మహిళా ఉపాధ్యాయులు బస్సు సౌకర్యం లేక ఎంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యవహరించడం సమంజసం కాదని పేర్కొన్నారు. వెంటనే సమయాన్ని మార్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, పాఠశాలల పనివేళలు సాయంత్రం 4 గంటలకే ముగించాల్సి ఉండగా కాంప్లెక్స్ మీటింగ్ పేరుతో 5 గంటల వరకు పెంచడమే కాకుండా కాంప్లెక్స్ సమావేశం పేరుతో ఐదున్నర గంటల వరకు అటెండెన్స్ పడకుండా ఆపివేయడం అమానుషం అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఇలాంటి నిర్ణయాలను తప్పు పడుతూ తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పేదలకు ఉచితంగా వైద్యం అందించాలన్న లక్ష్యంతో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, నంద్యాల సాయి బాలాజీ నర్సింగ్ హోం వైద్యులు హరినాథరెడ్డి, లక్ష్మీప్రసన్న చేస్తున్న సేవలను కొనియాడాక తప్పదని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. స్థానిక సాయి బాలాజీ నర్సింగ్ హోం ఆవరణలో ఆదివారం ఉచితంగా షుగర్, బీపీ, గుండెజబ్బుల వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300మంది రోగులను పరీక్షించారు. 200మందికి షుగర్, బీపీ పరీక్షలు, మరో 100 ఈసీజీలతో పాటు టూడీఎకోలతో పాటు గుండె స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. దాదాపు రూ.3 లక్షల విలువైన మందులను పంపిణీ చేశారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడారు. వైద్యులు జహంగీర్, మధుసూదన్‌రెడ్డి, ఫణిల్‌కుమార్, గోపినందన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకట హర చతుర్థి



సంజీవనగర్ రామాలయంలో వినాయక చవితి వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవ నగర్ రామాలయం, రోజాకుంటలోని నాగలింగేశ్వర ఆలయంలో ఆదివారం సంకట హర చతుర్థి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో చవితి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి క్షీరాభిషేకం, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, కలశ స్థాపన, మండపారాధన, అగ్నిప్రతిష్ట, శ్రీగణపతి, విద్యాగణపతి, సంపత్ గణపతి, లక్ష్మి సరస్వతి హోమం, పూర్ణాహుతి గావించి అనంతరం లక్ష గరికతో స్వామి వారికి సామూహిక అర్చన నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. నాగులకుంట రోడ్డులోని నాగలింగేశ్వర ఆలయంలో వేదపండితుడు విశ్వనాథ్ శాస్త్రి ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు.